జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

గురువారం | 16 | అక్టోబర్ | 2025 ◆ పేజీలు : 6

## తెలంగాణ రైజింగ్ విజన్ -2047 సర్వేలో ఉద్యోగులందరూ పాల్గొనాలి

- **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**




**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 15, ప్రజాజ్యోతి:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ రైజింగ్ విజన్ -2047 సర్వేలో జిల్లా లోని ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తప్పనిసరిగా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రానున్న దశాబ్దాల్లో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం, విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, పరిశ్రమలు, ఐటీ, పర్యావరణ పరిరక్షణ రంగాలలో అగ్రగామిగా నిలబెట్టే దిశగా ప్రభుత్వం "తెలంగాణ రైజింగ్ విజన్ -2047" డాక్యుమెంట్ ను రూపొందిస్తున్నదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో రూపొందిస్తున్న

మిగతా 2 లో...

2 లో




## సిఅండ్ ఎండి రాకతో...

# ఇల్లందు భవిష్యత్తుకు బాటలు పడతాయా.!

- జేకే-5 ఓసిలో తగ్గిన ఉత్పత్తి
- ప్రారంభం కాని పొడగింపు (పూసపల్లి) ప్రాజెక్టు
- కెఓసి పిట్-3లోనూ కాలయాపన!
- మనుగడ కోసం ప్రజలు, కార్మికుల ఎదురుచూపులు
- సిఅండ్ ఎండి పర్యటనపై సర్వత్ర ఉత్కంఠ

సింగరేణికి పుట్టినిల్లయిన ఇల్లందు ఏరియా భవిష్యత్ ఇప్పుడు ఒక కీలక మలుపులో ఉంది. సిఅండ్ ఎండి బలరాం ఇల్లందు ఏరియా పర్యటనతో కొత్త ఆశలు మొలకెత్తుతున్నాయి. ఐదేళ్లుగా ఫైళ్లలోనే మగ్గుతున్న జేకే-5 ఓసి పొడగింపు (పూసపల్లి) ప్రాజెక్టు గుట్టు ఈ సందర్శనతో రట్టవుతుందా అన్న చర్చ అన్ని వర్గాల్లో జోరుగా సాగుతోంది. ప్రాజెక్టుకు కావలసిన అనుమతులన్నీ పూర్తయ్యాయని స్థానిక అధికారులు నెలల క్రితం వెల్లడించినప్పటికీ పనులు ప్రారంభమవ్వలేదు. : "అనుమతులు ఇంకా కొన్ని దశల్లో ఉన్నాయంటూ" అధికారుల వ్యాఖ్యలు పొడుగవుతుండగా, కార్మికుల్లో ఆందోళన పెరుగుతోంది.

● ఇల్లందు, ప్రజాజ్యోతి



## పాల్వంచ పట్టణ సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..

**కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

**పాల్వంచ (రూరల్), అక్టోబర్ 15 (ప్రజాజ్యోతి):** పాల్వంచ మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నానని కొత్తగూడెం శాసనసభ సభ్యుడు కూనంనేని సాంబశివరావు తెలిపారు. బుధవారం పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రకుంట, మున్సిపల్ కార్యాలయ రహదారి, బీసీఎం రహదారి, ఇందిరా కాలనీ, నెహ్రూ నగర్ ప్రాంతాల్లో ఒక కోటి ఏడు లక్షల రూపాయల నిధులతో సిమెంట్ రహదారులు, సిమెంట్ డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ ప్రతి బస్తీలో రహదారులు, డ్రైన్ల నిర్మాణ పనులు పూర్తి స్థాయిలో కొనసాగుతున్నాయని, ప్రజల సౌకర్యార్థం నిధులను సమర్థంగా వినియోగిస్తున్నామని తెలిపారు. రహదారులు, త్రాగునీరు, విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజలకు మౌలిక వసతులు అందించడమే తమ లక్ష్యమని

మిగతా 2 లో...



## ఏజెన్సీ ప్రాంత అభివృద్దే మా లక్ష్యం

- **అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ నరేందర్**

**చర్ల, అక్టోబర్ 15 (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో బుధవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ ఆదేశాల మేరకు చర్ల మండలంలోని ఛత్తీస్గఢ్ రాష్ట్ర సరిహద్దు గ్రామమైన ఎర్రంపాడు గ్రామాన్ని అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ నరేందర్ , భద్రాచలం ఏఎస్పి విక్రాంత్ కుమార్ సింగ్ ఐపిఎస్ సందర్శించారు.సి ఆర్ పీ ఎఫ్ 141బి యెన్ అసిస్టెంట్ కమాండెంట్ వివేక్ రంజన్,చర్ల సీఐ రాజు వర్మ ఇతర పోలీస్ అధికారులు,సిబ్బందితో కలిసి మావోయిస్ట్ ప్రభావిత గ్రామంలోని 250 కుటుంబాలను సందర్శించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తున్న ఈ గ్రామ ప్రజలకు నెస్లే కంపెనీ వారి సహకారంతో నిత్యావసర వస్తువులను అందించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సారథ్యంలో

మిగతా 2 లో...



## వనం.. విడిచి.. జనంలోకి...

- మావోయిస్టు అగ్రనేత సోను లొంగుబాటు
- సోనుతో పాటు 61 మంది మావోయిస్టులు లొంగుబాటు
- పొలిట్ బ్యూరో సభ్యుడు సోను దాదా ముఖ్యమంత్రికి ఏ కె -47 అందజేత

**చర్ల, అక్టోబర్ 15 (ప్రజాజ్యోతి ):** తెలంగాణ చర్ల సరిహద్దు రాష్ట్రమైన మహారాష్ట్రలోని గడ్చిరోలిలో నక్సల్ ఫ్రంట్ లో బుధవారం చారిత్రాత్మక రోజు నమోదైంది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ సమక్షంలో మొత్తం 61 మంది మావోయిస్టు కార్యకర్తలు లొంగిపోయారు. వీరిలో అగ్రశ్రేణి మావోయిస్టు నాయకుడు మావోయిస్టు పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ సోను దాదా భూపతి కూడా ఉన్నారు. వీరిపై కోట్ల రూపాయల

మిగతా 2 లో...

## ఏజెన్సీ ప్రాంత అభివృద్దే మా లక్ష్యం





(మొదటి పేజీ తరువాయి...)

ఏజెన్సీ ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని,మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ఆదివాసీలకు విద్య,వైద్యం,రవాణా వంటి కనీస సౌకర్యాలను కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు.ఇందులో భాగంగానే జిల్లాలో ఏజెన్సీ ప్రాంతాల్లో ఇప్పటివరకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని తెలిపారు.వరద ప్రభావిత ప్రాంతాల్లో నివసించే అదీవాసీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.వర్షాల అనంతరం పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.డెంగీ,మలేరియా వంటి విషజ్వరాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.అభివృద్ధి నిరోధకులైన నిషేదిత మావోయిస్టులకు ఎవ్వరూ సహకరించవద్దని కోరారు.ప్రత్యక్షంగానైనా,పరోక్షంగానైనా మావోయిస్టులకు సహకరిస్తే,అట్టి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకొనబడతాయని అన్నారు.మారుమూల ఏజెన్సీ ప్రజలకు నిత్యావసర వస్తువులను అందించడానికి ముందుకొచ్చిన నెస్లే కంపెనీ వారికి ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

## తెలంగాణ రైజింగ్ విజన్ -2047 సర్వేలో ఉద్యోగులందరూ పాల్గొనాలి

(మొదటి పేజీ తరువాయి...)

ఈ విజన్ పత్రం భవిష్యత్ తెలంగాణ అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తుంది అన్నారు. ప్రజల సూచనలు, సలహాలు, అభిప్రాయాలను సమగ్రంగా చేర్చే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం సిటిజన్ సర్వేను ప్రారంభించిందని, ఈ సర్వే అక్టోబర్ 10నుండి ప్రారంభమై ఈ నెల 25వరకు కొనసాగుతుందని కలెక్టర్ వివరించారు. రాష్ట్రప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు, రైతులు, ఎన్.ఆర్.ఐలు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని తెలిపారు. ప్రతి ఉద్యోగి ఈ సర్వేలో తప్పనిసరిగా పాల్గొని తమ విలువైన సూచనలు అందించాల్సిందిగా సూచించారు. ఈ సర్వే ద్వారా ప్రభుత్వానికి వచ్చే ప్రజా అభిప్రాయాలు భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలకు దిశానిర్దేశం చేస్తాయన్నారు. అదేవిధంగా అన్ని శాఖాధికారులు తమ కార్యాలయాలలో సర్వే లింక్, QR కోడ్ ను స్పష్టంగా ప్రదర్శించడంతో పాటు విస్తృత ప్రచారం చేయాలని ఆయన ఆదేశించారు. రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం అన్ని ఉద్యోగులు ఈ సర్వేలో తప్పనిసరిగా పాల్గొనాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సర్వేలో పాల్గొనేవారు ఈ క్రింది లింకు ద్వారా తమ అభిప్రాయాలను తెలియజేయాలని కలెక్టర్ కోరారు. సర్వే లింక్: https://www.telangana.gov.in/telan.

# ఇల్లందు భవిష్యత్తుకు బాటలు పడతాయా!

**ఇల్లందు, అక్టోబర్ 15 (ప్రజాజ్యోతి):** సింగరేణికి పుట్టినిల్లయిన ఇల్లందు ఏరియా భవిష్యత్ ఇప్పుడు ఒక కీలక మలుపులో ఉంది. సిఅండ్ ఎండి బలరాం ఇల్లందు ఏరియా పర్యటనతో కొత్త ఆశలు మొలకెత్తుతున్నాయి. ఐదేళ్లుగా ఫైళ్లలోనే మగ్గుతున్న జేకే–5 ఓసి పొడగింపు (పూసపల్లి) ప్రాజెక్టు గుట్టు ఈ సందర్శనతో రట్టవుతుందా అన్న చర్చ అన్ని వర్గాల్లో జోరుగా సాగుతోంది. ప్రాజెక్టుకు కావలసిన అనుమతులన్నీ పూర్తయ్యాయని స్థానిక అధికారులు నెలల క్రితం వెల్లడించినప్పటికీ పనులు ప్రారంభమవ్వలేదు. : "అనుమతులు ఇంకా కొన్ని దశల్లో ఉన్నాయంటూ" అధికారుల వ్యాఖ్యలు పొడుగవుతుండగా, కార్మికుల్లో ఆందోళన పెరుగుతోంది. ఇప్పటికే జేకే–5 ఓసి పూర్తి దశకు చేరుకోవడంతో ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. కొంత మిగిలిన బొగ్గుతోనే కార్యకలాపాలు సాగుతున్నాయి.

### డిప్యూటేషన్ బదిలీలతో ఉద్రిక్తత

ఇల్లందు ఏరియాలోని జేకే–5 ఓసిలో



పనిచేస్తున్న సుమారు 30 మంది ఆపరేటర్లు ఇతర ప్రాంతాలకు డిప్యూటేషన్ బదిలీలపై వెళ్ళడం, యంత్రాలను తరలించడం కార్మికుల్లో ఆందోళనకు దారి తీసింది. అధికారులు, యూనియన్ నేతలు ఏరియా మనుగడపై నిర్లక్ష్యం వహిస్తున్నారని కార్మికులు మండిపడుతున్నారు. ఇక అధికారులే "ఇల్లందు బొగ్గు నాణ్యత తక్కువ" అని ప్రకటించడం కార్మికులను మరింత ఆగ్రహానికి గురి చేసింది. "వ్యాపారి తన వస్తువును చెడుగా చెప్పుకుంటే కొనుగోలుదారుడు ఎక్కడి నుంచి వస్తాడు?" అని ప్రశ్నిస్తున్నారు.



### కెఓసి పిట్-3లోనూ జాప్యం

కెఓసి పిట్–2 పూర్తి కాకముందే పిట్–3 ప్రాజెక్టును ప్రైవేట్ కాంట్రాక్టు సంస్థకు అప్పగించినా, సంస్థ సింగరేణి నిబంధనలను పాటించకపోవడంతో కాంట్రాక్టు రద్దు అయినట్టు సమాచారం. దీంతో ఆ ప్రాజెక్టు భవితవ్యం కూడా అనిశ్చితిలో పడింది.

### ప్రజలూ, కార్మికులూ ఒక్క మాట – "ఇల్లందు నిలబెట్టండి!"

జేకే–5 పొడగింపు ప్రాజెక్టు త్వరగా ప్రారంభమై ఇల్లందు ఏరియా మళ్లీ చైతన్యవంతం కావాలని ప్రజలు, కార్మికులు కోరుకుంటున్నారు. "దసరా, దీపావళి, సంక్రాంతి అంటూ మాటలు పొడిగిస్తూ ప్రజలను అయోమయంలోకి నెట్టకండి" అని వారు గుసగుసలాడుతున్నారు.

### సిఅండ్ ఎండి పర్యటనపై సర్వత్ర ఉత్కంఠ

ఈ పరిస్థితుల్లో సింగరేణి సిఅండ్ ఎండి బలరాం ఇల్లందు ఏరియా పర్యటనపై అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. ఇల్లందు ఏరియా మనుగడ కోసం సిఅండ్ ఎండి ఏ నిర్ణయాలు తీసుకోబోతున్నారు? ఏ హామీ ఇస్తారు? అన్నది కార్మికులూ, ప్రజలూ ఎదురు చూస్తున్న ప్రధాన ప్రశలు.

## పాల్వంచ పట్టణ సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..



(మొదటి పేజీ తరువాయి...)

ఒక్కొక్కటిగా ప్రతి పనిని పూర్తి చేసి పట్టణాన్ని అభివృద్ధి దిశగా తీసుకువెళ్తామన్నారు. పాల్వంచ–కొత్తగూడెం మున్సిపాలిటీలను కలిపి కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేసినట్లు తెలిపారు. కార్పొరేషన్ ఏర్పాటుతో పట్టణం నగర స్థాయి అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ధారా ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ సుజాత, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా,సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం,జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్,జిల్లా సమితి సభ్యులు వీ పద్మజ,డీ సుధాకర్, నిమ్మల రాంబాబు,ఇట్టి వెంకట్రావు, నాయకులు శనగారపు శ్రీనివాసరావు, వైయస్ గిరి,వల్లపు యాకయ్య,గౌస్,ఎస్ ఏ రెహమాన్,కరీం,రమేష్,గణేష్, ఆది నారాయణ,పట్టణ పోలీస్ సిబ్బంది,విద్యుత్,నీటి పారుదల, పట్టణాభివృద్ధి శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వనం.. విడిచి.. జనంలోకి...



(మొదటి పేజీ తరువాయి...)

రివార్డు ప్రకటించారు. ఈ మావోయిస్టులు ఆటోమేటిక్ రైఫిల్స్, ఐ యెన్ ఎస్ ఏ ఎస్ , ఏ కె –47సహా 50కి పైగా ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. ఈ లొంగుబాటు మహారాష్ట్రలోనే కాకుండా దేశవ్యాప్తంగా అతిపెద్ద నక్సలైట్ లొంగుబాటు ఆపరేషన్ గా పరిగణించబడుతుంది. దేశంలోనే అతిపెద్ద మావోయిస్టు నాయకుడు తన ఆయుధాలను విడిచిపెట్టాడు .మావోయిస్టు సంస్థ కేంద్ర కమిటీ సీనియర్ సభ్యుడు పొలిట్ బ్యూరో స్థాయి నాయకుడు సోను భూపతి బుధవారం తన సహచరులతో కలిసి 25 కిలోమీటర్ల అడవిని దాటిన తర్వాత పోలీసుల ఎదుట లొంగిపోయాడు. అతను తన ఆయుధాలను విడిచిపెట్టి తనతో పాటు ఒక పొలిట్ బ్యూరో సభ్యుడు, ఇద్దరు డి కె ఎస్ జెడ్ సి ఏం సభ్యులు, 10మంది డి వి సి ఏం (డివిజనల్ కమిటీ సభ్యులు) ఇతర క్రియాశీల నక్సలైట్ సభ్యులను తీసుకువచ్చాడు. లొంగుబాటు కార్యక్రమం గడ్చిరోలి పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగింది రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు, హోం శాఖ సీనియర్ సభ్యులు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ లు పాల్గొన్నారు."ఇది కేవలం లొంగుబాటు మాత్రమే కాదు, నక్సల్ ప్రభావిత ప్రాంతాలలో శాంతి అభివృద్ధి వైపు నిర్ణయాత్మక అడుగు" అని ముఖ్యమంత్రి ఫడ్నవీస్ అన్నారు. సంవత్సరాలుగా హింసలో చిక్కుకున్న ప్రజలు ఇప్పుడు జన జీవన స్రవంతిలోకి తిరిగి రావడానికి మా ప్రభుత్వం పునరావాస విధానాన్ని అనుసరించింది అని "గడ్చిరోలి పోలీసులు భద్రతా దళాలను ఆయన ప్రశంసించారు.ఈ లొంగుబాటును దేశవ్యాప్తంగా నక్సల్ ప్రచారంలో అతిపెద్ద విజయంగా అభివర్ణించారు.శాంతి అభివృద్ధి మార్గంలో గడ్చిరోలి – ఒక కొత్త అధ్యాయం దేశంలో కొనసాగుతున్న నక్సల్ వ్యతిరేక ప్రచారంలో ఇప్పటివరకు ఇదే అతిపెద్ద లొంగుబాటు. ఈ చారిత్రాత్మక లొంగుబాటు తర్వాత ఈ ప్రాంతంలో నక్సల్ కార్యకలాపాలు వేగంగా బలహీనపడతాయని గడ్చిరోలి పోలీసులు తెలిపారు. లొంగిపోయిన నక్సలైట్లందరికీ పునరావాసం పునరావాస ప్యాకేజీని పరిపాలన సిద్ధం చేసింది.మిగిలిన వారు కూడా జన జీవన స్రవంతి లోకి తిరిగి రావడానికి వీలు కల్పిస్తుంది అని అధికారులు అన్నారు .

## అన్నవరం పంచారామాలకు ప్రత్యేక బస్సులు

- **కొత్తగూడెం డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి**

**కొత్తగూడెం,అక్టోబర్ 15 (ప్రజాజ్యోతి):** కార్తీకమాసాన్ని పురస్కరించుకొని కొత్తగూడెం పరిసర ప్రాంత భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ కొత్తగూడెం డిపో నుండి ప్రత్యేక బస్సులు నడిపించనున్నారు. కొత్తగూడెం, పాల్వంచ నుండి అన్నవరానికి డీలక్స్ బస్సు అదేవిధంగా పంచారామాలకు అమరావతి, భీమవరం, ద్రాక్షారామం,పాలకొల్లు, సామర్లకోటకు సూపర్ లగ్జరీ బస్సు నడపబడుతుంది.ఈనెల 26 రాత్రి 8 గంటలకు పాల్వంచ నుండి కొత్తగూడెంకు బస్సులు బయలుదేరును.టికెట్ ధర.. అన్నవరంకు పెద్దలకు 720/– రూపాయలు.పిల్లలకు 390/– రూ,, పంచారామాలకు పెద్దలకు 2050 రూ.. పిల్లలకు..1050 రూ..నిర్ణయించడం జరిగిందని కొత్తగూడెం డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాల కోసం ఫోన్ నెంబర్ 9010374644 సంప్రదించవచ్చు.



# ఘనంగా సీనియర్ జర్నలిస్ట్ జన్మదిన వేడుకలు

- ఆరోగ్య జీవన యాత్ర సభ్యుల సమక్షంలో
- పండ్లు తో తయారు చేసిన కేక్.
- సాత్విక ఆహారం పంపిణీ.



**జూలూరుపాడు, అక్టోబర్ 15 ప్రజాజ్యోతి:** జూలూరుపాడు మండల కేంద్రంలో ఆరోగ్య జీవన యాత్ర సభ్యుల సమక్షంలో సీనియర్ జర్నలిస్ట్ బండ్ల వెంకట్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమం ద్వారా సమాజానికి ఒక సందేశాన్ని పంపాలనే ఉద్దేశంతో కెమికల్స్ మైదాలు లేకుండా సహజ సిద్ధంగా దొరికే పండ్లతో కేకులను తయారు చేశారు కేకు కోసం పుచ్చకాయలు బొప్పాయి ద్రాక్ష చెర్రీస్ మరియు అరటి పండ్లతో పాటు డ్రై ఫ్రూట్స్ ని ఉపయోగించారు. సభ్యులు ఆనంద ఉత్సాహాల మధ్య కేకును కత్తిరించారు సభ్యులందరూ జర్నలిస్టుకు శుభాకాంక్షలు తెలియజేశారు భవిష్యత్ మరింత ఆనందంగా ఉండాలని సూచించారు ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ ఆరోగ్య జీవనయాత్ర సభ్యుల సమక్షంలో జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని అందులో సహజసిద్ధమైన పండ్లను ఉపయోగించడం సమాజానికి ఓ సందేశాన్ని ఇవ్వటం గొప్ప విషయం అని అన్నారు. అయితే సుమారు 50 మందితో ఆరోగ్య జీవన యాత్ర సభ్యుల బృందం నిత్యం యోగా వాకింగ్ చేస్తూ జనాలకు చైతన్యం కలిగిస్తున్నారు ప్లాస్టిక్ వాడవద్దు అనే ఉద్దేశంతో బర్తడే అనంతరం సభ్యులకు స్టీల్ ప్లేట్ లలో డ్రై ఫ్రూట్స్ ఖర్జూర నానబెట్టిన బొప్పాయి కీర కిస్మిస్ జీడిపప్పును అందించారు. బర్తడే సమయంలో సాహససిద్ధమైన పండ్లతో కేకులు తయారు చేసుకోవచ్చని ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని అన్నారు ఈ కార్యక్రమంలో సభ్యులు యోగ గురువు బోసు నరేష్ నవీను బసవయ్య నరేష్ జానీ సురేష్ సింగ్ ప్రేమ్ కుమార్ సత్యనారాయణ సురేషు కమలాకర్ శంకర్ రావు వెంకటేశ్వర్లు మధు శర్మ భాస్కర్ శేఖర్ పూర్ణ బుడేన్ పాష. సుబ్బు విశ్వనాథం చౌదరి కోటయ్య శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# 11 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టివేత

**ఇల్లందు, అక్టోబర్ 15, ప్రజాజ్యోతి:** మండల పరిధిలోని సుభాష్ నగర్ లో సాగిని నర్సింహారావు ఇంట్లో అక్రమంగా పిడిఎస్ బియ్యం నిల్వ ఉన్నట్లు పక్కా సమాచారం మేరకు బుధవారం హైదరాబాద్ విజిలెన్స్ టాస్క్ ఫోర్స్ టీం –1, ఇల్లందు పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తాసిల్దార్ సంయుక్త ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో నాగిని నర్సింహారావు అక్రమంగా 22 ప్లాస్టిక్ బస్తాలలో నిలువ22 ప్లాస్టిక్ బస్తాలలో నిల్వ ఉంచిన 11 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని 6ఏ కేసు నమోదు చేయడం జరిగిందని ఇల్లందు పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసిల్దార్ పాషా తెలిపారు.

# 18న రాష్ట్ర బంద్ ను విజయవంతం చేయాలి

- జిల్లా అధ్యక్షులు మహంకాళి రామారావు.



**బూర్గంపహాడ్, అక్టోబర్15, (ప్రజాజ్యోతి):** స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ తలపెట్టిన రాష్ట్ర బంద్ కార్యక్రమాన్ని బీసీలందరూ పాల్గొని బంద్ ను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు మహంకాళి రామారావు కోరారు. 18న జరిగే తెలంగాణ రాష్ట్రబంద్ కు సంఘీభావం తెలుపుతూ బూర్గంపాడు మండల కేంద్రంలో నిరసన కార్యక్రమాలు చేశారు. పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజలు మద్దతు నిలవాలని బీసీ ప్రజలకు జరిగిన అన్యాయాన్ని వివరించి చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత బీసీ రిజర్వేషన్ పై కోర్టు స్టే ఇవ్వడం దేశ చరిత్రలో ఇదే మొదటిసారి అన్ని బీసీ రిజర్వేషన్లపై స్టే స్టే ఇచ్చిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక నాయకులు, సిపిఐ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# క్రీడాకారిణి సృజనకు ఘన సన్మానం



**బూర్గంపహాడ్, అక్టోబర్15(ప్రజా జ్యోతి):** బూర్గంపహాడ్ మండల కేంద్రంలో గల పాండవుల బస్తికి చెందిన మేక పున్నం కుమార్తె సృజన రాష్ట్ర స్థాయి అండర్ 19 ఫుట్ బాల్ జట్టుకు ఎంపికైంది. ఈ సందర్భంగా బుధవారం ప్రముఖ కాంట్రాక్టర్ పాకాల దుర్గాప్రసాద్ సృజనని అభినందించి శాలువా కప్పి సత్కరించారు. ప్రతిభావంతులను ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలకు చేరుతారని, సృజన మరింత ఎదగాలని ఆమె కుటుంబ సభ్యులను అభినందించారు. అలాగే బూర్గంపాడు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణా రెడ్డి ఆధ్వర్యంలో మేక సృజన ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ భూపల్లి నరసింహారావు, పిఎసిఎస్ డైరెక్టర్ బొల్లు రవి, మాజీ ఎంపీటీసీ జక్కం సర్వేశ్వర రావు, బానోత్ శ్రీను, బొల్లు సాంబ శివ రావు, చెన్నం రవి, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, కెవి రమణ, తోకల శ్రీను కొమ్ము రమణ, జక్కం శ్రీను, బర్ల సత్యనారాయణ, గంగపురి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# దొరికిన దొంగ... సొత్తు రికవరీ




**చర్ల, అక్టోబర్ 15: (ప్రజా జ్యోతి ):** భద్రాద్రి కొత్త గూడెం జిల్లా చర్ల మండలంలోని గాంధీ నగర్ గ్రామంలో కోడిరెక్కల. భాస్కర్ రావు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి గుమ్మం తొలగించి ఇంట్లోకి ప్రవేశించి బంగారు నగలు, రూ 80 వేల నగదును దొంగిలించిన దొంగ దొరికినట్టు భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ బుధవారం చర్ల మండలంలో ని పోలీస్ స్టేషన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ ములుగు జిల్లా వెంకటాపురం మండలం లోని సూరవీడు గ్రామానికి చెందిన ముత్తెబోయిన ప్రేమ్ చంద్ అనే యువకుడు ఈ నెల 9 న గాంధీ



నగర్ లో కోడిరెక్కల. భాస్కర్ రావు ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు అని ఏడు లక్షల 60 వేల విలువ చేసే బంగారు నగలు, రూ 80 వేల నగదును దొంగిలించాడు అని నిందితుడి నుంచి ఏడు లక్షల 60 వేల విలువ చేసే బంగారు నగలు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ తెలిపారు. నగదును దొంగిలించిన వ్యక్తి ఖర్చు చేసినట్లు తెలిపారు. చోరీకి పాల్పడ్డ నిందితుడిని అరెస్టు చేసి, బంగారు నగలు రికవరీ చేసిన చర్ల ఎస్ హెచ్ ఓ రాజువర్మ ను సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

# జిల్లా కలెక్టర్ జితేష్ వి. పటేల్ చేతుల మీదుగా పాల్వంచలో బాస్కెట్ బాల్ శిక్షణకు శ్రీకారం





**పాల్వంచ(రూరల్) అక్టోబర్ 15 (ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పటేల్ బుధువారం పాల్వంచలోని సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ హాస్టల్ ప్రాంగణంలో బాస్కెట్ బాల్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జీతేష్ వి.పటేల్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలోనూ చురుకుగా పాల్గొనాలని, ప్రతి విద్యార్థి కనీసం ఒక క్రీడలోనైనా శిక్షణ పొందేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. క్రీడలతో విద్యార్థుల్లో మానసిక, శారీరక దృఢత పెరుగుతుందని తెలిపారు. జిల్లాలో బాస్కెట్ బాల్ క్రీడాభివృద్ధి కోసం ముంబైకు చెందిన హై–5 ఫౌండేషన్ ముందుకు వచ్చిందని, ఆ సంస్థ క్రీడకు అవసరమైన స్పోర్ట్స్ సామగ్రి, కోచింగ్ సిబ్బందిని సమకూర్చనుందని ఫౌండేషన్ ప్రతినిధి మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఫౌండేషన్ సేవలను కలెక్టర్ ప్రశంసిస్తూ, జిల్లా యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించడంలో ఇలాంటి సంస్థల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. బాలికలకు శిక్షణ అందిస్తున్న కోచ్ రాకేశ్ సేవలను కూడా కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడల అధికారి ఎం.పరంధామ రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ముర్రేడు బ్రిడ్జి మరమ్మతు పనులను పరిశీలించిన:కూనంనేని

- అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే



**కొత్తగూడెం, అక్టోబర్ 15(ప్రజాజ్యోతి ):** పట్టణ, గ్రామీణ రహదారులు, అంతర్గత రోడ్ల నిర్వహణ, పర్యవేక్షణపై అధికారులు నిర్లక్ష్యం వీడాలని, ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులను ఇబ్బందులకు గురిచేసే నిర్లక్ష్యాన్ని సహించబోనని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధికారులను హెచ్చరించారు. పట్టణంలోని ముర్రేడు బ్రిడ్జి రోడ్డులో జరుగుతున్న మరమ్మత్తు పనులను బుధవారం మున్సిపల్, ఆర్అండ్బి, పోలిసుశాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ గత పాలకుల హయాంలో రోడ్ల నిర్మాణంలో జరిగిన అవినీతి, అక్రమాలవల్లే ప్రజలకు ఈ దుస్థితి ఏర్పడుతోందని, నిర్మాణాల్లో నాణ్యత లోపించి అనతికాలంలోనే రోడ్లు ధ్వంసమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం జరుగుతున్న రోడ్ల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులు నాణ్యతతో నిర్మించాలని, ఎలాంటి నాణ్యత లోపించినా అధికారుల్లో బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. రోడ్లపై ఏర్పడిన గుంతల విషయంలో రాజకీయాలు తగవని, సమస్య ఉంటే బాధ్యతగల పౌరులుగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. పోస్టాఫీసు సెంటర్ నుంచి హేమచంద్రాపురం వరకు, సింగరేణి ప్రధాన కార్యాలయం నుంచి సింగరేణి ప్రధాన ఆస్పత్రి, అదేవిధంగా సింగరేణి మెయిన్ స్టోర్స్ వరకు మూడు రోడ్లను యుద్ధ ప్రాతిపదికనే పునర్నిర్మాణ పనులు చేపట్టబోతున్నట్లు తెలిపారు. ఈ మూడు రోడ్ల నిర్మాణంకోసం సంస్థ ద్వారా రూ.2.80 కోట్లు మంజూరయ్యాయని, పనులను కొద్దిరోజుల్లోనే పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని కూనంనేని తెలిపారు. రెండో దఫాగా బస్టాండు సెంటరు నుంచి త్రిమాత టెంపుల్ వరకు రోడ్డు పునర్నిర్మాణం, రోడ్డు వెడల్పు, బస్టాండు గేట్ సెంటర్లలో హైమాస్ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, ఆర్అండ్బి అధికారులు, నాయకులు లగడపాటి రమేష్, దేవరగట్ల రాంబాబు, రమేష్ పాల్గొన్నారు.

# చర్ల సిహెచ్ సి లో మొదటి సిజేరియన్ ఆపరేషన్

- సిబ్బందిని అభినందించిన ఎం ఎల్ ఏ డాక్టర్ తెల్లం వెంకటరావు,జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్, డి సి హెచ్ ఎస్ డాక్టర్ రవి బాబు



**చర్ల, అక్టోబర్ 15 (ప్రజాజ్యోతి):** చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన ఘట్టం బుధవారం ఆవిష్కృతమైంది గత కొన్నాళ్ళుగా ప్రాథమిక వైద్యానికే పరిమితమైనా వైద్య సదుపాయాలు నేడు స్పెషాలిటీ వైద్య సేవలను సైతం అందుబాటులోకి వచ్చింది.ఎం ఎల్ ఏ చొరవతో ప్రత్యేక దృష్టి పెట్టిన జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ అదనపు ప్రోత్సాహాలు ప్రకటించి గర్భిణి స్త్రీల ఆరోగ్య రీత్యా ఒక ప్రసూతి వైద్యురాలు,ఒక పిల్లల వైద్య నిపుణుడు,ఒక మత్తు వైద్యుడు ని నియమించారు.ఈ నియామకంలో డి సి హెచ్ ఎస్ డాక్టర్ రవి బాబు ప్రత్యేక చొరవ చూపి వైద్యులను పది రోజుల క్రితం నియమించారు.ఈ క్రమం లో నేడు చర్ల సి హెచ్ సి లో మొదటి సీజేరియన్ ఆపరేషన్ జరిగింది. చర్ల మండలం కొత్తూరు గ్రామం కి చెందిన తన్నీరు రాజేశ్వరి మొదటి కాన్పు కోసం రాగా సుఖప్రసవం కోసం ప్రయత్నం చేసి కాన్పు చేయలేని పరిస్థితిలో తల్లి బిడ్డ క్షేమం కోసం ఎమర్జెన్సీ ఆపరేషన్ చేసి పండంటి రెండు కేజీల మగ బిడ్డకి ఊపిరిపోశారు. గతం లో ప్రసూతి సేవల కోసం అరవై కిలోమీటర్ల దూరంలో భద్రాచలం వెళ్లే పరిస్థితులు ఉండేవి. కానీ ఏజెన్సీ లో ని చర్లలో సైతం ప్రసూతి సేవలను అందుబాటులో తెచ్చిన ఎం ఎల్ ఏ తెల్లం వేంకట రావు ,కలెక్టర్ జితేష్ పాటిల్,డి సి హెచ్ ఎస్ రవి బాబు లకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సాయి వర్ధన్ కృతజ్ఞతలు తెలిపారు.ఆసుపత్రిలో లో అందుతున్న స్పెషాలిటీ సేవల పట్ల చర్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఆపరేషన్ లో ప్రసూతి వైద్యురాలు శ్రావణి,పిల్లల వైద్యులు రవి కుమార్ ,మత్తు వైద్యుడు శివ రామ కృష్ణ , నర్సింగ్ ఆఫీసర్ ఝాన్సీ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# నర్సంపేటలో తోటకూరి అనసూర్యమ్మ దిశాదినోత్సవం ఘనంగా నిర్వహణ



**పాల్వంచ (రూరల్ ), అక్టోబర్ 15 (ప్రజాజ్యోతి ):** పాల్వంచ మండలం నర్సంపేట గ్రామంలో తోటకూరి అనసూర్యమ్మ దిశాదినోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యుడు కూనంనేని సాంబశివరావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంలో సాంబశివరావు మాట్లాడుతూ తోటకూరి అనసూర్యమ్మ వంటి మహిళా పోరాట యోధుల త్యాగాలు స్ఫూర్తిదాయకమని, వారు చూపిన దారిలో నడిచే వారే నిజమైన సామాజిక మార్పు సాధించగలరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు,సిపిఐ మండల సహాయ కార్యదర్శి గుండాల నాగరాజు, పెద్దమ్మ గుడి ధర్మకర్త శెనగరపు శ్రీనివాసరావు,మన్నెం వెంకన్న,వై.ఎస్. గిరి,సిపిఐ నాయకులు,గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# డిసిసి అభ్యర్థులపై అభిప్రాయ సేకరణ



**ఇల్లందు, అక్టోబర్ 15, ప్రజాజ్యోతి:** ఏఐసీసీ ఆదేశాలు, టిపిసిసి పిలుపు మేరకు బుధవారం ఇల్లందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డిసిసి అభ్యర్థులపై ఏఐసిసి సెక్రెటరీ, డిసిసి ఎన్నికల ఇంచార్జ్ జాన్సన్ అబ్రహం, ఎమ్మెల్యే కోరం కనకయ్యల సమక్షంలో అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఇల్లందు నియోజకవర్గంలో నుంచి డిసిసి పదవి కోసం ఎస్. కె. జానీ, ఏలూరి కోటేశ్వరరావులు దరఖాస్తు చేసుకోవడంతో నాయకుల వద్ద నుండి రహస్యంగా అభిప్రాయాలను సేకరించడం జరిగింది. ఈ అభిప్రాయాలను టీపీసీసీ ద్వారా ఏఐసీసీకి పంపడం జరుగుతుందని ఇంచార్జ్, స్థానిక ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు, రాష్ట్ర అటవీశాఖ కార్పొరేషన్ చైర్మన్ పోదెం వీరయ్య, టీపీసీసీ జనరల్ సెక్రటరీలు మోత్కూరి ధర్మారావు, నాగ సీతారాములు, నల్లపు దుర్గాప్రసాద్, టీపీసీసీ నాయకులు సుబ్బారావు, సంజీవ్ ముదిరాజ్, సాగరిక, నాగేందర్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న, పట్టణ, మండల అధ్యక్షులు దొడ్డ డానియల్, పులి సైదులు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ యదళ్లపల్లి అనసూయ, మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, మండల రాము, చిల్లా శ్రీనివాస్, గందే సదానందం, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యతోనే భవిష్యత్తు కాంతిమయం



**చర్ల, అక్టోబర్ 15:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలం లోని వనవాసి పరిషత్ కి బుధవారం రైస్ పేట కాలని ప్రాదమిక పాఠశాల ప్రదానోపాధ్యాయుడు బత్తుల శ్రీనివాసరావు తన కుమారుడు, హన్మకొండ యూనియన్ బ్యాంక్ మేనేజర్ బత్తుల అశోక్ వంశీ జన్మదినం సందర్భంగా చర్లలోని వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం విద్యార్ధి నిలయంకు 50 కేజీల బియ్యం, విద్యార్థులకు పండ్లు, బిస్కెట్స్, భోజనం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్ మాట్లాడుతూ మారుమూల గ్రామాల విద్యార్దుల ఉన్నతికి చర్లలో వనవాసీ వసతి గృహం నడపడం అబినందనీయమని అన్నారు. విద్యార్దుల పురోభివృద్ధిలో నిలయ కమిటీ సభ్యులు అందచేస్తున్న సేవలు అమోఘమని పేర్కొన్నారు. విద్యార్దులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వారి అభ్యున్నతిలో బాగస్వాములు కావడం తనకు సంతోషం కలిగిస్తోందని వెల్లడించారు. ఇక్కడి విద్యార్దులలో ఎక్కువ మంది తమ పాఠశాలలో విద్యనభ్యసించడం తనకు గర్వకారణంగా ఉందన్నారు. మారుమూల గ్రామాల నుండి వచ్చి తెలుగు భాష అంతగా తెలియకున్నా వీరిని మట్టిలో మాణిక్యాలుగా తీర్చిదిద్దడం సంతోషకరమని అన్నారు. మౌళిక సదుపాయాలు లేని గ్రామాల నుండి వచ్చి మైదాన ప్రాంత విద్యార్దులకు ధీటుగా విద్యతో పాటు అద్భుతంగా సంస్కృత శ్లోకాలను పఠిస్తుండటం అభినందనీయమని పేర్కొన్నారు. సుదూర, కనీస సౌకర్యాలు లేని గ్రామాల నుండి వచ్చి విద్యనభ్యసిస్తున్నారని, చదువుతో పాటు సంస్కారం, వినయ విదేయత ఉంటే జీవితంలో రాణిస్తారని అన్నారు. కష్టపడి చదివితే జీవితంలో అనుకున్నది సాదిస్తారని, ప్రతి ఒక్కరూ కష్టపడటం అలవర్చుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ చదువుకోవాలని లేకుంటే దుర్భర జీవితం గడపాల్సి వస్తుందని, ఇటువంటి అవకాశాలకు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేసారు. సంస్థ గౌరవ సలహాదారులు, విశ్రాంత ప్రభుత్వ ప్రదానోపాధ్యాయులు బివిఎస్ఎల్ నరసింహారావు మాట్లాడుతూ సంస్ధ చేస్తున్న సేవలను గుర్తించి విద్యార్థులకు పలు సౌకర్యాలు కల్పిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఒక్కరూ పేద విద్యార్దుల చదువులకు సహకరించి వారి ఉన్నతికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వనవాసీ ప్రాంత సహ మహిళా ప్రముఖ్ పెద్దాడ ఆశాలత, నిలయ కమిటీ అధ్యక్షుడు తాటి పాపారావు, కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ, ఉపాధ్యక్షులు గోగికార్ రాంలక్ష్మణ్, సహ కోశాదికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, ప్రఖండ ప్రముఖ్ గొంది శోభన్‌బాబు, నిలయ ప్రముఖ్ గొంది ప్రసన్నకుమారి, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు బేబిరాణి పాల్గొన్నారు.

# విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



**చర్ల, అక్టోబర్ 15, (ప్రజా జ్యోతి):** చర్ల మండలంలో బుధవారం శ్రీవాణి విద్యానికేతన్ లో చదువుకున్న ఇమ్మంది హిమ వర్షిని ఎంబీబీఎస్ లో సీటు సాధించిన సందర్భంగా శ్రీ వాణి విద్యానికేతన్ పాఠశాలలో సన్మానించడం జరిగింది .ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ చర్ల మండలంలో వాణి విద్యానికేతన్ అంటే ఒక బ్రాండ్ అని ఇక్కడ చదువుకున్న చాలా మంది విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉన్నారని ఇదంతా వాణి విద్యానికేతన్ లో మేము నేర్పించే క్రమశిక్షణ విద్య పట్ల మేము చూపిస్తున్న శ్రద్ధ అని అన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు ఏం వి ఎల్ నరసింహారావు మాట్లాడుతూ పట్టుదలతో చదివితే సాధ్యం కానిదంటూ ఏమీ ఉండదని చిన్నప్పుడు నుంచి శ్రద్ధగా క్రమశిక్షణగా విద్య నేర్చుకోవాలని విద్యుత్తోనే అందరికీ బంగారు భవిష్యత్తు ఉంటుందని దానికి నిదర్శనంగా ఇమ్మంది హిమ వర్షిని అని శ్రీ వాణి విద్యానికేతన్ లో చదువుకొని ఎంబిబిఎస్ లో సీటు సాధించిందని అందరూ హిమ వర్షిణిని ఆదర్శంగా తీసుకొని కష్టపడి చదవాలని మీరు కూడా మిగతా వారికి ఆదర్శంగా నిలవాలని అన్నారు. వచ్చే ఏడాది నుంచి నేతాజీ సైనిక్ స్కూల్స్ ప్రారంభం కాబోతున్నాయని కావున ఈ సదవకాశాన్ని శ్రీ వాణి విద్యానికేతన్ విద్యార్థులు అందరూ ఉపయోగించుకోవాలని దానికి తగ్గట్టుగా ఉపాధ్యాయ బృందము విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఆయా విద్యాసంస్థల్లో వారికి సీటు వచ్చే విధంగా చేయాలనీ సూచించారు . ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరిప్రసాద్ మాట్లాడుతూ చిన్నప్పుడు నుంచే మనందరం లక్ష్యం పెట్టుకొని ముందుకు సాగాలని లక్ష్యంతో ముందుకు సాగితే సాధ్యం కానిది అంటూ ఏమీ లేదని అందరూ కష్టపడి చదివి వృద్ధిలోకి రావాలని అన్నారు.ఈ సందర్భంగా విద్యార్ధిని హిమవర్షిణి, ఆమె తల్లిదండ్రులు రాంబాబు, ప్రసన్నకుమారి లకు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఉపాద్యాయులు పి వెంకటేశ్వర్లు, పాఠశాల ఉపాద్యాయులు పాల్గొన్నారు.

# 27 మంది మావోయిస్టులు లొంగుబాటు

- లొంగిపోయిన వారిలో పది మంది మహిళలు, 17 మంది పురుషులు
- లొంగిపోయిన వారిపై 50 లక్షల రివార్డు



**చర్ల, అక్టోబర్ 15:(ప్రజా జ్యోతి ):** తెలంగాణ చర్ల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ సుక్మాలో ఛత్తీస్ గఢ్ ప్రభుత్వం యొక్క "నక్సలైట్ సరెండర్ రిహాబిలిటేషన్ పాలసీ 2025" "నియాద్ నెల్లా నార్" పథకం ద్వారా ప్రభావితమై, 10మంది మహిళలు 17 మంది పురుషులు సహా మొత్తం 27 మంది క్రియాశీల మావోయిస్టులు బుధవారం సుక్మాలోని పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయంలో లొంగిపోయారు. వీరిలో 50 లక్షల రూపాయల రివార్డ్ కలిగిన మావోయిస్టులు కూడా ఉన్నారు. లొంగిపోయిన వారిలో పీ ఎల్ జీ ఏ బెటాలియన్ నంబర్ 1 నుండి ఇద్దరు హార్డ్ కోర్ మావోయిస్టులు, ఒక సి వై సి ఏం , 15 మంది పార్టీ సభ్యులు ఫ్రంట్ ఆర్గనైజేషన్లకు చెందిన 11 మంది సభ్యులు ఉన్నారు. ఓయం లఖ్మ అనే మావోయిస్టు అత్యధిక రివార్డు 10 లక్షలు, మరి కొందరు 8 లక్షలు, 3 లక్షలు, 2 లక్షలు , 1 లక్ష రివార్డులు కలిగి ఉన్నారు. లొంగుబాటు కార్యక్రమంలో ఎస్పీ కిరణ్ చవాన్, డిఐజి ఆఫీస్ సెకండ్ కమాండ్ ఆఫీసర్ సుక్మా సురేష్‌సింగ్ పాయల్, సిఆర్ పిఎఫ్ కోబ్రా బెటాలియన్ సీనియర్ అధికారులు పాల్గొన్నారు. మావోయిస్టుల దురాగతాలు వివక్షత హింసాత్మక భావజాలంతో విసిగిపోయి జన జీవన స్రవంతిలోకి తిరిగి రావాలని నిర్ణయించుకున్నట్లు లొంగిపోయిన మావోయిస్టులు పేర్కొన్నారు. ప్రభుత్వ కొత్త పునరావాస విధానం కింద అందరికీ 5౦,౦౦౦ రూపాయల ప్రోత్సాహకం ఇతర ప్రయోజనాలు లభిస్తాయి అని ఈ లొంగుబాటు సుక్మా పోలీసులకు పెద్ద విజయాన్ని తెచ్చిపెట్టింది అని ఈ ప్రాంతంలో శాంతిని నెలకొల్పే దిశగా ఇది ఒక ముఖ్యమైన అడుగు అని అధికారులు అన్నారు .

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**ఇల్లందు, అక్టోబర్ 15, ప్రజాజ్యోతి:** రాష్ట్రంలో వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న పేదవారికి ప్రభుత్వం ద్వారా మంజూరయ్యే సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాలకు అండగా నిలబడడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇల్లందు పట్టణం, మండలంలో 16 మంది లబ్ధిదారులకు రూ. 5,11,500 సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ యదళ్లపల్లి అనసూయ, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు




**టేకులపల్లి,అక్టోబర్15,ప్రజాజ్యోతి :** మండలంలోని పశువైద్యాధికారి మంగ అనిల్ ఆధ్వర్యంలో బుధవారం 9వ మైల్ తండ లో 201 ఆవులు, గిద్దలు,17 పాడి గేదలు, ఈ తండలో 218 పశువులకు గాలి టీకాలు వేశారు. ముత్యాలంపాడు పరిధిలో దుబ్బ తండ గ్రామంలో 92, బొమ్మనపల్లిలో 73, బోడు పరిధిలో 64 గాలిటీకాలను వేయడం జరిగింది. మండలంలో మొత్తం 447 గాలి టీకాలను వేయడం జరిగిందని టేకులపల్లి మండల పశువైద్యాధికారి డాక్టర్ అనిల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అన్వేష్, వైద్యాధికారి డివి, సతీష్, సిబ్బంది జే వి ఓ పార్వతి, జెవీడి ఈశ్వరి, ఎల్ ఎస్ ఏ రాజేష్, గోపాల మిత్రులు వెంకటేశ్వర్లు, భాస్కర్, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రపతి నిలయం సందర్శించిన ఎర్రగుంట జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు

- **ఇన్నోవేటివ్ ప్రాజెక్టులకు రాష్ట్రస్థాయి ఐదవ బహుమతి**




**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 15, ప్రజాజ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎర్రగుంట విద్యార్థులు, ఉపాధ్యాయులు మొత్తం 37 మంది బుధవారం సికింద్రాబాద్ బొల్లారంలో గల రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించారు. అక్టోబర్ 15 అబ్దుల్ కలాం జన్మదినాన్ని పురస్కరించుకొని ఇన్నోవేటివ్ ఐడియా ప్రోగ్రామ్‌లో భాగంగా ఆన్లైన్‌లో అప్లై చేసిన "ఇన్నోవేటివ్ ఫ్రూట్ కలెక్షన్ మెథడ్", "బ్లైండ్ మాన్స్ స్టిక్" అనే రెండు ప్రాజెక్టులకు రాష్ట్రస్థాయి ఐదవ బహుమతి లభించింది. ఈ ప్రాజెక్ట్స్‌ను విద్యార్థులు శృతి కీర్తన, లహరి, చరణ్, పవన్ చైతన్య, హర్ష ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, జిల్లా విద్యా శాఖ అధికారి నాగలక్ష్మి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్శనలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉండేటి ఆనందకుమార్ తోపాటు శంకర్ మహాదేవన్, బి. వెంకటేశ్వరరావు, జయరాం, మోతిలాల్, బాలు, పద్మ, సుశీల, ప్రమీల రాణి తదితరులు పాల్గొన్నారు. మొత్తం 37 మంది విద్యార్థులు సందర్శనలో భాగమయ్యారు.

# ఆర్థిక మంత్రి ఇలాక లో ఆకలి పోరాటం

- **గిరిజన కార్మికుల సమస్యలు పట్టని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, యంఎల్ఏలు...!**
- **ఉధృతం అవుతున్న హాస్టల్ డైలీ వేజ్ కార్మికుల సమ్మె.**
- **72 గంటల ధర్నాతో దిగి రాకపోతే ప్రజాప్రతినిధులను ఊర్లోకి రానివ్వం:సిఐటియు**
- **గిరిజన కార్మికులకు పెరుగుతున్న ప్రజాసంఘాల మద్దతు.**






**భద్రాచలం, అక్టోబరు15, ప్రజాజ్యోతి :** తెలంగాణ రాష్ట్ర ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్క ఇలాకాలోని గిరిజన కార్మికుల ఆకలి పోరాటం 3 4రోజులుగా కొనసాగుతుంది. ఎండనక వాననక ఆడ మగ తేడా లేకుండా రోడ్డుపైనే వంటావార్పు చేసి చలిలోనే నిద్రిస్తూ 72 గంటలుగా ధర్నా చేస్తున్న పక్కనే ఉన్న గిరిజన శాఖ సంక్షేమ మంత్రికి గిరిజన కార్మికుల ఆకలి కేకలు వినిపించడం లేదు. చదువుకోవాల్సిన చిన్నారి చేతులు పోయిల దగ్గర మగ్గిపోతున్న పాఠాలు చెప్పాల్సిన పంతులు వంట పాత్రను శుభ్రం చేస్తున్న ప్రభుత్వ పెద్దలు కరుణించడం లేదు కార్మికుల ఓట్లతో గెలిచిన కాంగ్రెస్ పెద్దలు 99 రోజులగా ఆశ్రమ హాస్టల్ డైలీ వేజ్ కార్మికుల పోరాటం వైపు తొంగి చూడకపోగా మాకేం పట్టినట్టు వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఆ కార్మికులు చేస్తున్న పోరాటం అంతకంతకు ఉధృతం అవుతుందని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇప్పటివరకు ఏ రాష్ట్ర చరిత్ర చూసిన కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వాలు అవకాశం ఉంటే జీతాలు పెంచుతాయి లేకపోతే యధావిధిగా కొనసాగిస్తాయి. అంతేగాని తెలంగాణ రాష్ట్రంలో మార్పు తెస్తామని ప్రగంబలు పలికి అధికారానికి ఎక్కిన కాంగ్రెస్ పాలకులు మాత్రం దీనికి విరుద్ధంగా దొంగ జీవోలను తీసుకు వచ్చి అప్పటివరకు ఇస్తున్న జీతాలను తగ్గించి విద్యార్థులకు అన్నం వండి పెట్టే కార్మికులను పస్తులించే పరిస్థితికి తీసుకువస్తే జీతాలు పెంచక పోయినా పర్లేదు పర్వాలేదు పాత జీతాలు అయిన కొనసాగించండి మహాప్రభో అంటూ సమ్మెబాట పట్టిన కార్మికులు వర్షాన్ని చలిని సైతం లెక్కచేయకుండా 72 గంటల ధర్నా విజయవంతం చేశారు. బుధవారం 72 గంటల ధర్నాలో భాగంగా సిఐటియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ మాట్లాడుతూ ఆర్థిక శాఖ మంత్రి సొంత జిల్లాలోని కార్మికులు ఆకలి పోరాటం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. పక్కనే ఉన్న ములుగు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు ఆదివాసి మహిళల ఆకలి బాధలు కనిపించకపోవడం అని అన్నారు. 94 రోజుల సమ్మెతో పాటు చరిత్రలో ఎన్నడు లేని విధంగా 72 గంటల మహాధర్నా సైతం కార్మికుల ఐక్యంగా విజయవంతం చేశారని ఈ ధర్నాతోనైనా ప్రభుత్వ పెద్దలు దిగి రాకపోతే కలిసివచ్చే అన్ని ప్రజా సంఘాలను కలుపుకొని ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. గిరిజన కార్మికులేకదా ఏం చేస్తారులే అని ప్రభుత్వ పెద్దలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వారి కండగా విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ప్రజాసంఘాల నాయకులు ఆ ప్రజాప్రతితులను ఊర్లో కూడా తిరగనీయకుండా అడ్డుకుంటామని ఏజే రమేష్ స్పష్టం చేశారు. టీఎన్జీవో సంఘం భద్రాచలం శాఖ సంపూర్ణ మద్దతును ప్రకటించింది టీఎన్జీవో డివిజన్ అధ్యక్షులు డెక్క నరసింహారావు కార్యదర్శి బాలకృష్ణ ఆధ్యర్యంలో నాయకులు ఐటీడీఏ వద్ద సమ్మెకు మద్దతు పలికారు వేతనాలు తగ్గించటం చట్ట వ్యతిరేకమని దేశ చరిత్రలో ఇటువంటి దుర్మార్గం ఎప్పుడు జరగలేదని పేర్కొన్నారు ఏ ప్రభుత్వమైనా జీతం పెంచుతుంది గాని తగ్గించడం ఏమిటని విమర్శించారు హాస్టల్ వర్కర్ల సమ్మెకు తాము అండగా ఉంటామని టీఎన్జీవో నేతల ప్రకటించారు. అనంతరం భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో సమ్మెకు పూర్తి సంఘీభావం తెలిపారు ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ కార్యదర్శి ఎర్రం శెట్టి వెంకట రామారావు మాట్లాడుతూ డైలీ వేజ్ కార్మికుల తో కలిసి భవన నిర్మాణ కార్మికుల సైతం ప్రత్యక్ష ఉద్యమంలోకి వస్తామని హామీ ఇచ్చారు. 99 రోజులగా కార్మికుల సమ్మెలో ఉంటే విద్యార్థుల చదువులపై ప్రభుత్వం పెద్దలకు పట్టింపు లేదా అని ఆయన ప్రశ్నించారు. జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులు పోటీలు పడి ప్రచారం చేసుకుంటున్నారే తప్ప గిరిజన కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు ఏమాత్రం ముందుకు రావడం లేదని అన్నారు. ఇకనైనా ప్రభుత్వ పెద్దలు దిగి రాకపోతే ఇతర సంఘాల మద్దతుతో ప్రజాప్రతినిధుల ఇండ్లను సైతం సీఐటీయూ ఆధ్వర్యంలో ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు సిఐటియు నాయకులు నాగేశ్వరరావు హీరాలాల్ గిరి ఈశ్వర్ మంగి లాల్ జలంధర్ జయ కౌసల్య రామ కల మోహన్ అనంతరాములు నరసింహారావు వెంకటేశ్వర్లు పండ మంగమ్మ తదితరులతోపాటు వందలాది మంది హాస్టల్ వర్కర్లు పాల్గొన్నారు.

## న్యాయపోరాటం చేస్తున్నాం.. సహకరించండి

- **దుకాణాలు తెరవొద్దు.. మద్దతు ఇవ్వండి**
- **ప్రజలు, చాంబర్ ఆఫ్ కామర్స్ లను కోరిన బీసీ సంఘాల జేఏసీ నాయకులు**



**అశ్వారావుపేట , అక్టోబర్ 15, ప్రజాజ్యోతి :** 42 శాతం బీసీ రిజర్వేషన్లపై చేసే పోరాటం న్యాయ పోరాటమని, అన్ని వర్గాల వారు సహకరించాలని బీసీ సంఘాల జేఏసీ నాయకులు కోరారు. హైకోర్టు ఇచ్చిన స్టేను నిరసిస్తూ ఈనెల 18న తలపెట్టిన రాష్ట్ర బందును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విద్యాసంస్థలు తెరవదని కోరటంతో పాటు, వ్యాపార సముదాయాలు స్వచ్ఛందంగా బందు చేయాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు సంకా ప్రసాదును కలసి మద్దతు కోరారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇచ్చేవరకు ఈ పోరాటం ఆగదని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘాల జేఏసీ కన్వీనర్ కురిసెట్టి నాగబాబు బీసీ నాయకులు ఉపాధ్యాయుల సూర్యప్రకాశరావు ఫకీరయ్య, చిన్నంశెట్టి సత్యనారాయణ తాళం సూరిబాబు, లింగిశెట్టి వెంకటేశ్వరరావు, ఇరగదిండ్ల రాంబాబు, లింగం కుంట కృష్ణ, సోమాని రాజా రమేష్, పసుపులేటి ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఐటీడీఏలోని ఖాళీ భవనాల్లో మహిళలకు ఉపాధి శిక్షణా కేంద్రాలకు మార్చాలి


- **జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ వెల్లడి**



**భద్రాచలం, అక్టోబరు 15, ప్రజాజ్యోతి :** ఐటీడీఏ ప్రాంగణంలో నిరుపయోగంగా ఉన్న భవనాలను గిరిజనులకు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, మహిళలకు ఉపాధి శిక్షణా కేంద్రాలుగా మార్చేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. బుధవారం ఐటీడీఏ ప్రాంగణంలో ఎన్ఆర్సీ నాయకపోడు మాస్కుల తయారీ కేంద్రం, పీఎంఆర్సీ గదులు, గిరిజన భవనం, గిరి బజారును పీవో రాహుల్ తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఖాళీగా ఉన్న భవనాల్లో వాటిని ఎలా ఉపయోగించాలో తగిన ప్రతిపాదనలను విభాగాలకు చెందిన కీలక అధికారులకు అందజేయాలన్నారు. మలేరియా కార్యలయంలో ఖాళీగా ఉన్న భవనంలో డ్రగ్స్ కు సంబంధించిన ప్రతి మందులు భద్రపరచడానికి ర్యాకులు ఏర్పాటు చేయాలని, పీఎంఆర్సీ భవనంలో పౌల్ట్రీ, వ్యవసాయ ఇతర పథకాలకు సంబంధించిన పెయింటింగ్ చిత్రాల ప్లెక్సీల రూపంలో వేయించి వాటికి సంబంధించిన సమాచారం గిరిజనులకు అర్థమయ్యే విధంగా ప్రదర్శించాలన్నారు. గిరి బజారులో అమ్మకాలు జరిపే వస్తువులు మార్కెట్ కంటే తక్కువలో దొరకుతాయని వస్తువులు మధ్య తరగతి కుటుంబాలు కొనుగోలు చేయడానికి వస్తారని వారికి ఇబ్బందులు పడకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమలో ఏపీవో జనరల్ దేవిద్రాజు, డీడీ అశోక్, ఈఈ మధుకర్, ఐటీసీ చీఫ్ మేనేజరు చెంగల్రావు, ఏసీఎంవో రమేష్ పాల్గొన్నారు.

# ధాన్యం దిగుబడిలో తెలంగాణ ఆల్ టైమ్ రికార్డ్

- 148.03 లక్షల మెట్రిక్ టన్నులతో ధాన్యం ఉత్పత్తి
- రైతులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు జరపండి
- ధాన్యం కొనుగోళ్లపై వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్లతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- కొత్తగూడెం జిల్లాలో 193 ధాన్యము కొనుగోలు కేంద్రాల ద్వారా2'38, 177 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరగవచ్చని వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ వెల్లడి





**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 15, ప్రజా జ్యోతి:** డాక్టర్ బి.ఆర్. అంబెడ్కర్ సచివాలయంలో బుధవారం రాష్ట్రవ్యాప్తంగా వానాకాలం ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై రాష్ట్ర నీటిపారుదల, పౌర సంబంధాల శాఖ మంత్రి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో పాటు పలువురు మంత్రులు కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఈ వానాకాలంలో తెలంగాణ రాష్ట్రం ధాన్యం దిగుబడిలో చరిత్రాత్మక రికార్డు సృష్టించిందని తెలిపారు. భారతదేశ చరిత్రలోనే అత్యధికంగా 148. 03 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి నమోదైందని, ఇది రైతుల కష్టానికి నిదర్శనమని అన్నారు. అధిక దిగుబడి దృష్ట్యా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండి, ధాన్యం కొనుగోళ్లు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు తగిన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, రవాణా వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైతులు ఎక్కడా నిరీక్షించాల్సిన పరిస్థితి లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. కొనుగోలు వివరాలను వెంటనే నమోదు చేసి, 48 గంటల లోపు రైతులకు చెల్లింపులు జరిగేలా చూడాలని సూచించారు. అదేవిధంగా ధాన్యం తరలింపు, నిల్వ ,మిల్లర్లతో సమన్వయం విషయంలో జిల్లా స్థాయిలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. అవసరమైతే మౌలిక సదుపాయాల కల్పన కోసం అదనపు ఖర్చులకు వెనుకాడ రాదన్నారు,. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లింపులకు కూడా సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. గడిచిన యాసంగి సీజన్ లో కలెక్టర్ల సమన్వయంతో సత్ఫలితాలు సాధించామన్నారు. ఈ వానాకాలంలో అధిక దిగుబడి దృష్ట్యా అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నదని, రైతులకు ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ లతో కలిసి క్యాంపు కార్యాలయం నుండి పాల్గొనగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ వానాకాలం ధాన్యం కొనుగోళ్లను పూర్తిస్థాయిలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలతో సమన్వయం కల్పించామని తెలిపారు. జిల్లాలో మొత్తం 193 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, సుమారు 2,38,177 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరగవచ్చని అంచనా వేశామని వివరించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రాల వద్ద తాగునీరు, విశ్రాంతి గదులు, తూకం యంత్రాలు, తడిపరీక్ష పరికరాలు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. అలాగే కొనుగోలు చేసిన ధాన్యాన్ని వేగంగా తరలించేందుకు రవాణా వసతులు, నిల్వ గోదాములు, మిల్లర్లతో సమన్వయం చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు 48 గంటల్లోపే చెల్లింపులు జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ వానాకాలం కొనుగోళ్లు రైతులకు సౌకర్యవంతంగా, పారదర్శకంగా సాగేందుకు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తోందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సచివాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్, రవీంద్ర లతోపాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, పౌరసరఫరాల అధికారిని రుక్మిణి , సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కీబో క్రిప్టో డిజిటల్ కరెన్సీ ఐదవ వార్షికోత్సవంలో పాల్గొన్న - ఎమ్మెల్యే కోరం

- దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలలో ఐదవ వార్షికోత్సవ వేడుకలు




**టేకులపల్లి,అక్టోబర్ 15, ప్రజాజ్యోతి:** కీబో క్రిప్టో కరెన్సీ ఐదవ వార్షికోత్సవం సందర్భంగా టేకులపల్లిలో సీఈవో కణతాల వసంతరావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య హాజరై కేక్ ను కట్ చేశారు. ఈ సందర్భంగా కీబో క్రిప్టో సీఈవో మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా సుమారుగా 28 వేల క్రిప్టో కరెన్సీ ఉన్న అందులో ఏ ఒక్కటి కూడా యుటిలిటీ అనేది ఇవ్వడం లేదు భారతదేశ ముద్దుబిడ్డ కీబో క్రిప్టో ఎండి కిలపర్తి వెంకట్రావు ప్రపంచవ్యాప్తంగా ఢీ కాయిన్ డి సెంట్రల్ కాయిన్ గా ఓన్ బ్లాక్ చైన్ టెక్నాలజీ తో యుటిలిటీకి అవకాశం కల్పించబోతున్నారుఅని పేర్కొన్నారు.ఈ కైను ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 4న దుబాయిలో లిస్టింగ్ చేయబోతున్నారని అన్ని భారతదేశ ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తుందని ఇంటర్నేషనల్ ఎక్సేంజీలలో లిస్టింగ్ చేయబోతున్నారు అని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో యువత మొత్తం డిజిటల్ కరెన్సీని వైపు యువత పయనించాలన్నారు. ఈ కార్యక్రమంలో అనబత్తుల సైదులు, పొనకంటి ఉపేందర్ రావు,బుర్ర ధర్మయ్య,లక్కినేని శ్యాంబాబు, దొడ్డ సత్యనారాయణ,పోరండ్ల జానకి,లక్ష్మణ్,సెరప మోహన్ సాగర్, చింతల సురేష్, గుగులోత్ రాజు,కుంజ రామనాథం, కూరాకుల లక్ష్మీనారాయణ, చీమల రామకృష్ణ, బింగి కృష్ణ, తదితరులు కీబో కుటుంబ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ధ్వంసం అయిన రోడ్లు బాగు చేయక పోతే ప్రజా ఉద్యమం తప్పదు

- మళ్లీ రోడ్డు ఎక్కుతున్న ఇసుక లారీలు
- చోద్యం చూస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు





**భద్రాచలం ,అక్టోబర్ 15,ప్రజాజ్యోతి :** భద్రాచలం నియోజకవర్గం లో వేలాది ఇసుక లారీల వల్ల ప్రజా రవాణాకు ఆటంకం కలుగుతుందని, అధికారులకు ప్రజాప్రతినిధులకు స్థానిక ఎమ్మెల్యేకు పట్టింపు లేనట్టుగా కనపడుతుందని.. ఎంపీలు ఎమ్మెల్యేలు కూడా ఏజెన్సీ ప్రాంతం పై చిన్నచూపు చూపుతున్నారని బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు రావులపల్లి రాంప్రసాద్, నియోజకవర్గ నాయకులు మానే రామకృష్ణ అన్నారు. దాదాపు 3 నెలలుగా రోడ్లు విధ్వంసం అయిపోయి, రోడ్ల పక్కన ఉన్న పంట పొలాలు నాశనం అయి ప్రజలు రైతాంగం నానా ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోని స్థితిలో ప్రభుత్వం లేదని ఇసుక లారీల విధ్వంసానికి గురైన రోడ్లను యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి బాగు చేయాలని డిమాండ్ చేశారు... ఈ ప్రాంత సహజ సంపద ద్వారా ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్న ఈ ప్రాంత ప్రజలును అభివృద్ధిని రోడ్లు విధ్వంసం అవుతున్న పట్టించుకునే దాఖలాలు లేవని ఈ ప్రాంతంలో సంపద దోచుకుంటూ ఈ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతుంటే జిల్లా మంత్రులు, అధికార యంత్రాంగం చోద్యం చూస్తూ ప్రజల్ని నయవంచనకు గురిచేస్తుందని బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఇసుక లారీల సమస్యపై రోడ్లు విధ్వంసమైన పట్టించుకోని ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీవ్రస్థాయిలో ఆందోళన నిర్వహిస్తామని రావులపల్లి,మానే తెలియజేశారు. కోట్లాది రూపాయల ముడుపులు ఇసుక వ్యాపారం ద్వారా చేతులు మారుతున్నాయని ప్రజాప్రతిథులు ప్రజలను పట్టించుకోవడం మరిచిపోయి ముడుపుల కోసం ప్రజలు ఇబ్బంది పెడుతున్నారని అన్నారు.

## పిడిఎస్యు మహాసభలను జయప్రదం చేయండి




**కొత్తగూడెం,అక్టోబర్ 15 (ప్రజాజ్యోతి ):** విద్యారంగ సమస్యలపై విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్యు మండల జిల్లా రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి పి.చేతన్ పిలుపునిచ్చారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐఎఫ్టియు కార్యాలయం నందు జరిగిన పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశం పట్టణ నాయకులు కే సురేందర్ అధ్యక్షతనలో నిర్వహించరు. ఈ సందర్భంగా చేతన్ ప్రసంగిస్తూ ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్యు) విద్యార్థి సమస్యలపై విద్యారంగ సమస్యలపై ఎన్నో ఉద్యమాలు నిర్వహించి విజయం సాధించిందని విద్యార్థుల హక్కుల గురించి కొట్లాడి సాధించి పెట్టడంలో ప్రధాన పాత్ర పోషించిందని వారన్నారు. విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో పోరాడి విద్యార్థుల కోసం ఎంతోమంది అమరవీరులు తమ అమూల్యమైన ప్రాణాలు బలిగున్నారని జాజిరెడ్డి జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ చేరాలు శ్రీపద శ్రీహరి కోలాశంకర్ లాంటి విద్యార్థి రత్నాలు రక్త తర్పణం చేశారని అన్నారు. అమరవీరుల స్ఫూర్తితో గతం నుండి వర్తమానం వర్తమానం నుండి భవిష్యత్తు తన ఉద్యమాలను విస్తృత పరచడం కోసం రాష్ట్ర 23వ రాష్ట్ర మహాసభలను వరంగల్లో జరుపుకుంటుందని అదే క్రమంలో మండల జిల్లా స్థాయి మహాసభలను జరుపుకుంటుందని ఈ మహాసభల విజయవంతంకై అందరు కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో పిడిఎస్యు జిల్లా నాయకులు ప్రేమ్ కుమార్, భాస్కర్, పట్టణ నాయకులు హరీష్, జీవన్, సురేందర్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## న్యాయపోరాటం చేస్తున్నాం.. సహకరించండి

- దుకాణాలు తెరవొద్దు.. మద్దతు ఇవ్వండి
- ప్రజలు, చాంబర్ ఆఫ్ కామర్స్ లను కోరిన బీసీ సంఘాల జేఏసీ నాయకులు



**అశ్వారావుపేట, అక్టోబర్ 15, ప్రజాజ్యోతి :** 42 శాతం బీసీ రిజర్వేషన్లపై చేసే పోరాటం న్యాయపోరాటమని, అన్ని వర్గాల వారు సహకరించాలని బీసీ సంఘాల జేఏసీ నాయకులు కోరారు. హైకోర్టు ఇచ్చిన స్టేను నిరసిస్తూ ఈనెల 18న తలపెట్టిన రాష్ట్ర బందును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విద్యాసంస్థలు తెరవదని కోరటంతో పాటు, వ్యాపార సముదాయాలు స్వచ్ఛందంగా బందు చేయాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు సంకా ప్రసాదును కలసి మద్దతు కోరారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇచ్చేవరకు ఈ పోరాటం ఆగదని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘాల జేఏసీ కన్వీనర్ కురిసెట్టి నాగబాబు బీసీ నాయకులు ఉపాధ్యాయుల సూర్యప్రకాశరావు ఫకీరయ్య, చిన్నంశెట్టి సత్యనారాయణ తాళం సూరిబాబు, లింగిశెట్టి వెంకటేశ్వరరావు, ఇరగదిండ్ల రాంబాబు, లింగంకుంట కృష్ణ, సోమాని రాజా రమేష్, పసుపులేటి ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.